సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 20 । జనవరి । 2023



సోమశిలలో 71.33 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 71.33 టీఎంసీలు ఉన్నాయి. 2,252 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1170, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,460
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,222
3 శాతం జీఎస్టీతో	రూ.5,379
సవర (8 గ్రా)	రూ.43,032

గరిష్టం/కనిష్టం
30.5 /21.3

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి ఎక్కువగా ఉంది. గాలిలో తేమ 58 శాతం ఉంది.

న్యూస్‌రీల్

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసులునాయక్

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్

బుచ్చిరెడ్డిపాళెం: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు వారి పిల్లలు నిర్లక్ష్యం చేయొద్దని, బాగా చూసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులనాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని దామరమడుగు గ్రామంలో ఉన్న కొండ కోటారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారితోపాటు నిరక్షరాస్యులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అనంతరం కాగులపాడు గిరిజన కాలనీలో పర్యటించిన ఆయన అక్కడ కూడా సదస్సును నిర్వహించారు. స్థానిక గిరిజనులు తమకు ఆధార్‌కార్డులు లేవని తెలపడంతో వెంటనే ఈ విషయంపై ఎంపీడీఓ నరసింహరావుకు ఫోన్లో సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి చెన్నమ్మ, లీగల్ వలంటీర్లు వేణుగోపాల్, సురేంద్ర, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు (అర్బన్): జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కేవీఎస్ చక్రధర్ బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నుడాలో స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న టీవీ సునీల్‌ను కావలి ఆర్డీఓ ఆఫీసు ఏఓగా నియమించారు. అక్కడ ఏఓగా పని చేస్తున్న సూర్యనారాయణ సింగ్‌ను గుడ్లూరు తహసీల్దార్‌గా నియమించారు. సైదాపురం తహసీల్దార్ కృష్ణను వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

శిక్షణకు జేసీ కూర్మనాథ్, కమిషనర్ హరిత

నెల్లూరు(అర్బన్): ఐఏఎస్‌లుగా ఉద్యోగోన్నతి పొందిన జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత వచ్చే నెల 13 నుంచి మార్చి 24వ తేదీ వరకు ముస్సోరిలో జరిగే శిక్షణకు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గురువారం విడుదల చేశారు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాల్లో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 963 మంది విద్యార్థులకుగాను 124 మంది గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో నలుగురు, నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 13,290 మంది విద్యార్థులకు 1,080 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సూళ్లూరుపేటలోని శ్రీ ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

27న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరుగుతుందని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జలవనరులశాఖ, పీఆర్, వ్యవసాయం, విద్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖలపై సమావేశంలో సమీక్షించడం జరుగుతుందన్నారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. సమావేశానికి జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు తప్పని సరిగా హాజరుకావాలని సీఈఓ కోరారు.

అగ్రిమెంట్స్‌కు హక్కులు

- సాదా బైనామాల ద్వారా భూముల కొనుగోలు
- ఆ భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో 9,586 మంది రైతుల దరఖాస్తు
- అత్యధికంగా కావలి డివిజన్ నుంచి 3,496 వినతులు
- ప్రభుత్వ నిర్ణయంతో దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం

2021 నవంబరు వరకు జరిగిన సాదా బైనామానాలను హక్కు పత్రాలుగా పరిగణిస్తూ దశాబ్దాల రైతుల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోంది. అన్ రిజిస్టర్ అగ్రిమెంట్ల ద్వారా భూములు కొనుగోలు చేసుకున్న రైతులు, వారి తర్వాత వారి వారసుల అనుభవంలో ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో హక్కుదారులు కాలేకపోయారు. వీరికి పట్టాదారు పుస్తకాలు రాని పరిస్థితి. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో పాత అగ్రిమెంట్లను అధికారిక హక్కు పత్రాలుగా గుర్తిస్తూ రైతులకు హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



కందుకూరు: దశాబ్దాల తరబడి రెవెన్యూ శాఖలో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే భూముల రీసర్వే వంటి కార్యక్రమాల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా సర్వే పనులు జరుగుతుండగా మరో పక్క నిషేధిత భూములు (22ఏ) సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చింది. ఇదే సమయంలో మరో రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది. దశాబ్దాల తరబడి రైతులు ఎదురుచూస్తున్న 'సాదాబైనామా' సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాదాబైనామా సమస్యలు పరిష్కారమై భూములపై సంబంధిత వ్యవసాయ భూములపై శాశ్వత హక్కులు దక్కనున్నాయి. గతంలో తెల్లకాగితాలు, స్టాంప్ పేపర్ల మీద జరిగిన వ్యవసాయ భూ లావాదేవీల అగ్రిమెంట్లు జరిగాయి. ఇటువంటి సాదా బైనామా లావాదేవీల భూములపై అధికారికంగా ఎటువంటి యాజమాన్య హక్కులు ఉండవు. రెవెన్యూ శాఖలో ఆన్‌లైన్ కావు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడం కూడా కుదరదు. ఇలా దశాబ్దాల క్రితం నుంచి జరిగిన లావాదేవీలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించి హక్కులు కల్పించాలని రైతులు సంవత్సరాల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే గత ప్రభుత్వాలు వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్యలుగా మిగిలిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేందుకు తగిన మార్గదర్శకాలను జారీ చేసింది.

దశాబ్దాలుగా పెండింగ్

ఈ సాదా బైనామాల సమస్యల ఇప్పటిది కాదు. దశాబ్దాల తరబడి పరిష్కారం కాని సమస్యగా రెవెన్యూ శాఖలో నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. 2021 నవంబరు వరకు జరిగిన సాదా బైనామాలకు అనుమతి ఇచ్చింది. ఈ మార్గదర్శకాల ఆధారంగా రెవెన్యూ అధికారులు సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో సాదాబైనామా సమస్యలు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులు భారీ పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలోనే వీటిపై దాదాపు 60 వేల దరఖాస్తులు వచ్చాయని అయితే వాటిపై అప్పట్లో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో తిరస్కరించినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో అన్ని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 9,586 మంది దరఖాస్తు

సాదాబైనామా సమస్యలపై ఇప్పటి వరకు జిల్లాలో 9,586 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో అత్యధికంగా కావలి రెవెన్యూ డివిజన్‌లో 3,496 మంది, నెల్లూరు డివిజన్‌లో 3,182 మంది, ఆత్మకూరు డివిజన్‌లో 2,173 మంది, కందుకూరు డివిజన్‌లో అతి తక్కువగా 735 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీటిలో 5,448 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. మరో 4,035 దరఖాస్తులకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు ప్రారంభించలేదు. అన్ని సక్రమంగా ఉన్న పలు దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తు ఆధారంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి అన్ని సక్రమంగా ఉంటే రెవెన్యూ రికార్డులో సంబంధిత రైతు పేరు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడంతో పాటు, భూములను ఆన్‌లైన్ కూడా చేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 6 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించి భూములను మ్యుటేషన్ చేశారు. దీంతో ఆ భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు లభిస్తాయి. దీని వల్ల తదుపరి భూముల క్రయవిక్రయాలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు లభిస్తుంది.

2021 నవంబరు వరకు అగ్రిమెంట్లకే..

2021 నవంబర్ వరకు జరిగిన సాదాబైనామా లావాదేవీలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదు ఎకరాల లోపు భూమి ఉండే చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆపై భూమి ఉండే రైతులు మార్కెట్ ధర ప్రకారం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.
– సీతారామయ్య, తహసీల్దార్, కందుకూరు

కందుకూరు టీడీపీలో కుమ్ములాట

కందుకూరు టీడీపీలో ఇద్దరు నేతల మధ్య రగులుతున్న ఆదిపత్య పోరు మరోసారి రచ్చకెక్కింది. పార్టీలో నేతల అంతర్గత కుమ్ములాటలు ఎన్టీఆర్ వర్ధంతి వేదికగా వేడిపుట్టించాయి. రెండు వర్గాల నేతల మధ్య మాటల తూటాలు హాట్‌టాపిక్ అయ్యాయి. ఇటీవల అధినేత చంద్రబాబు ఇద్దరి మధ్య రాజీ ప్రయత్నం చేసినా ప్రస్తుతం పతాక స్థాయికి చేరాయి.



- ఎన్టీఆర్ వర్ధంతి వేదికగా మరోసారి బహిర్గతమైన వర్గ విభేదాలు
- రాజేష్ తీరుపై మాజీ ఎమ్మెల్యే దివి శివరాం గరంగరం
- శివరాం విమర్శలపై రాజేష్ వర్గం ఎదురుదాడి

సాక్షి, నెల్లూరు: కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఇంటూరి నాగేశ్వరరావు కొనసాగుతున్నారు. అయితే నాగేశ్వరరావు కంటే ముందు నుంచే నియోజకవర్గంలో పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఇంటూరి రాజేష్ ప్రస్తుతం నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడం, పైగా ఇద్దరూ బంధువులు. రాజేష్ పార్టీ నాయకత్వాన్ని ఆశించి పెద్ద ఎత్తున ఖర్చు పెట్టుకుని కార్యక్రమాలు చేస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పథకం ప్రకారం నాగేశ్వరరావుకు ఇన్‌చార్జి పదవి ఇప్పించి రాజేష్‌కు పొగబెట్టాడని రగిలిపోతున్నారు.

మొదట్లో దివి శివరాం రాజేష్‌ను ప్రోత్సహించారు. తర్వాత పార్టీ పదవుల సందర్భంగా తలెత్తిన వివాదం వల్ల వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో శివరాం హైదరాబాద్‌లో బిల్డర్‌గా ఉన్న నాగేశ్వరరావుని పార్టీ పెద్దలకు పరిచయం చేసి ఇన్‌చార్జి పదవి ఇప్పించారు. ఈ వ్యవహారంతో శివరాం, నాగేశ్వరరావు మధ్య అంతర్గత ఒప్పందం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అప్పటి వరకు పార్టీ కార్యక్రమాలు చేస్తూ ఖర్చు చేసిన రాజేష్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ ఇన్‌చార్జి పదవి వస్తుందని ఆశించిన తరుణంలో జరిగిన ఈ అవమానంతో రాజేష్ వర్గం రగిలిపోతోంది. మరో పక్క దివి శివరాం, ఇన్‌చార్జిగా ఉన్న నాగేశ్వరరావును ప్రోత్సహిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పని చేయాలని చెబుతుంటే రాజేష్ వర్గం వ్యతిరేకిస్తోంది.

రాజేష్ వర్గం కొత్త కుంపటి

నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలతో తనకు టికెట్ రాదని భావించిన రాజేష్ వర్గం కొత్త కుంపటిని రాజేసింది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుకు మద్దతు తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న పోతుల యాక్టివ్ అయితే తాము మద్దతు ఇస్తామంటూ రాజేష్ వర్గం ప్రోత్సహించింది. అయితే పోతులకు అధిష్టానం నుంచి స్పష్టమైన హామీ లేకపోవడంతో ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. దీంతో రాజేష్ వర్గం ఇన్‌చార్జి నాగేశ్వరరావు వర్గానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కందుకూరు వచ్చిన పార్టీ అధినేత చంద్రబాబు ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి ఇద్దరూ కలిసి పనిచేయాలని సూచించారు. కానీ వీరు ఇద్దరూ మరుసటి రోజు నుంచే వేర్వేర్లు కుంపట్లు రగిలిస్తున్నారు.

ఎన్టీఆర్ వర్ధంతితో మరింత దూరం

రెండు రోజుల క్రితం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో రెండు వర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. దివి శివరాం, ఇన్‌చార్జి నాగేశ్వరరావు కలిసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళిలర్పించగా, రాజేష్ వేరుగా తన వర్గంతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌ని ఉద్దేశించి దివి శివరాం చేసిన వ్యాఖ్యలు రెండు వర్గాల మధ్య మాటల తూటాలు పేలాయి. దీంతో రాజేష్ వర్గం సైతం ప్రతిగా శివరాంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఇద్దరి మధ్య పేలుతున్న మాటల తూటాలకు పార్టీ కుప్పకూలడం ఖాయంగా కనిపిస్తోందని టీడీపీ శ్రేణులు ఇదేం ఖర్మ బాబు అంటున్నారు.

యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త



కవులు, రచయితలను సన్మానిస్తున్న కలెక్టర్ తదితరులు



యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

- కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): తెలుగు సమాజాన్ని చైతన్య పరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనీకులని, ఆయన చెప్పిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్ ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగి వేమన తెలుగుజాతికి, తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారన్నారు. అలాంటి మహనీయుని స్మరించుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం మన అదృష్టమన్నారు. సాహిత్యంలోనూ, తెలుగువారి జీవితంలోనూ వేమన పద్యాలు ఎప్పటికీ విడదీయరాని బంధం కలిగి ఉన్నాయన్నారు. ప్రతి విషయంలో మన పెద్దలు వేమన పద్యాలు గురించి ఉదాహరణగా చెప్పడం జరుగుతుందన్నారు. వేమన పద్యాల్లోని నీతి, తత్వం గ్రహించి జీవితాన్ని మెరుగు పరచుకోవచ్చన్నారు. తెలుగు భాష ఉన్నంత వరకు వేమన పద్యాలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. అప్పటి సమాజంలో ఉన్న రుగ్మతలు, వ్యసనాలు గమనించి వాటినుంచి బయటపడే మార్గాలు గురించి తెలిపారన్నారు. వేమన సాహితీ సంపద 200 ఏళ్ల వరకు ప్రచురణకు నోచుకోలేదని అయినా ప్రజల నోళ్లలో నానుతూ ఉండే వన్నారు. అప్పటి బ్రిటిష్ అధికారి చార్లెస్ ఫిలప్ బ్రౌన్ ప్రజల్లో ప్రచారంలో ఉన్న వేమన పద్యాలను విని వాటిని పరిశోధించి అన్నింటిని పుస్తక రూపంలో ప్రచురించేందుకు కృషి చేశారన్నారు. తెలుగు సాహిత్యాన్ని, తెలుగు భాషను నిలబెట్టే వేమన పద్యాలు నేర్చుకుందామని, అందరికీ నేర్పిద్దామని తెలిపారు.

కవులకు సన్మానం

ఈ సందర్భంగా వేమన పద్యాలను వినిపించిన కవులను కలెక్టర్ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పద్యాలను వినిపించిన విద్యార్థిని, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి కనకదుర్గాభవాని, డీఈఓ సుబ్బారావు, ఆర్ఐ ప్రసాద్‌రావు, సర్వశిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, కవులు మద్దూరి శ్రీనివాసులు, సుభద్రాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో వేమన జయంతి

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో యోగివేమన జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి, సంఘసంస్కర్త అన్నారు. వేమన పద్యం రాని తెలుగువారు ఉండరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కందుకూరుకు విచారణ కమిటీ రాక

కందుకూరు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బహిరంగ సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ప్రమాద స్థలాన్ని ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ శుక్రవారం పరిశీలించనుంది. గత నెల 28న పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించారు. అయితే అధికారులు అనుమతించిన ప్రదేశంలో కాకుండా ముందుకు వచ్చి ఇరుకైన నాలుగు రోడ్ల కూడలిలో ప్రసంగ వాహనాన్ని నిలపడం, రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు కట్టడం వల్ల తొక్కిసలాట జరిగింది. ప్రమాదంలో 8 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై రిటైర్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ శుక్రవారం కందుకూరు రానుంది. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించడంతో పాటు అధికారులు, ప్రత్యక్ష సాక్షులను విచారించనుంది.

విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు గురువారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) విశాఖపట్నం నుంచి ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగర్జునరెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు గురువారం వర్చువల్ పద్ధతిలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. నెల్లూరు జిల్లా సర్కిల్ తరఫున విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయ భవనంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కావలి నుంచి శాంతికుమార్ అనే వినియోగదారుడు పలు సూచనలు చేశారు. గతంలో కుటీర పరిశ్రమలకు విద్యుత్ సర్వీసు కనెక్షన్లు కేటగిరీ 2, కేటగిరీ 4గా ఉండేవని, వాటిని కేటగిరీ 3కి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 10 హార్స్‌పవర్ (హెచ్‌పీ) లోపల ఉన్న కుటీర పరిశ్రమల సర్వీసులను 15 హార్స్ పవర్‌కి పెంచాలని, సామిల్లులను కూడా కుటీర పరిశ్రమల కింద పరిగణించి కేటగిరీ 3కి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సోమశేఖర్‌రెడ్డి, బాలచంద్ర, జయకృష్ణారెడ్డి, పరంధామయ్య, మధు, రఘు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీధర్, సునీల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌భవన్‌లో వర్చువల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి

- రవాణాశాఖ అవగాహన ర్యాలీ

నెల్లూరు (టౌన్): ద్విచక్ర వాహనచోదకులు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాని చెప్పారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ బీవీనగర్ నుంచి ముత్తుకూరు బస్టాండ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి, నెల్లూరు ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు కార్తీక్ పవన్, గోపినాయక్, రాంబాబు, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సీఐలు నాగేశ్వరమ్మ, రమణారెడ్డి, సౌత్ ట్రాఫిక్ ఆర్ఎస్ఐ చంద్రమౌళి పాల్గొన్నారు.




జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ సుభాని

రాత పరీక్షకు సర్వం సిద్ధం

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- గుర్తింపు కార్డు తప్పనిసరి
- 500 మందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

నెల్లూరు (క్రైమ్): పోలీసు కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష ఈ నెల 22వ తేదీ ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరగనుంది. అందుకు తగిన ఏర్పాట్లను ఎస్పీ సీహెచ్ విజయారావు పర్యవేక్షణలో అధికారులు పూర్తి చేస్తున్నారు. నెల్లూరు పరిధిలోని 44 పరీక్ష కేంద్రాల్లో 16,532 మంది, కావలి పరిధిలోని 8 పరీక్ష కేంద్రాల్లో 4,420 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాయనున్నారు. రాత పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు గురువారం స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరుకున్నాయి. నెల్లూరు పరిధిలోని పరీక్ష కేంద్రాలకు ఏఎస్పీ డి.హిమవతి, కావలి పరిధిలో కావలి డీఎస్పీ వెంకటరమణ నోడల్ అధికారులుగా నియమించారు. 500 మంది సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వీరితో పాటు అదనంగా రక్షక్ మొబైల్, బ్లూకోట్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ షాపులను మూసివేయాలని ఇప్పటికే పోలీసు బాస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.



అభ్యర్థులకు నిబంధనలు

- అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.
- 10 గంటల దాటిన తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.
- ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్, రేషన్‌కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు)తో హాజరుకావాలి.
- కాలిక్యులేటర్, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచీలను తీసుకురాకూడదు
- బులుగు లేదా నలుపు రంగు బాల్‌పాయింట్ పెన్నుతో మాత్రమే పరీక్ష రాయాలి
- ఒక్కసారి పరీక్ష హాల్లోకి వచ్చాక పరీక్ష పూర్తయ్యేంత వరకు బయటకు పంపరు.
- పరీక్షల్లో కాపీ చేసేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటుకు చర్యలు

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ఇప్పటికే పోలీసు అధికారులు ఆర్టీసీ అధికారులను కోరారు. దీంతో ఆర్టీసీ అధికారులు దూరంగా ఉన్న పరీక్ష కేంద్రాలకు ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

దళారులను నమ్మొద్దు

కానిస్టేబుల్స్ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఉద్యోగాలిప్పిస్తామంటూ దళారులు మోసగించే అవకాశం ఉందని వీరిని నమ్మొద్దని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఎల్‌పీఆర్‌బీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శనివారం సాయంత్రం వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

క్లుప్తంగా

పోర్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న సీఈఓ జీజే రావు

ముత్తుకూరు: మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. గోపాలపురంలోని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన వేడుకలను పోర్టు సీఈఓ జీజే రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు ముగ్గులు, ఆటలు, పాటలు, పతంగుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. సుమారు 2,000 మందికిపైగా ఈ వేడుకలకు విచ్చేశారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ హెడ్ మొహిత్ షెకావత్, హెచ్ఆర్ డీజీఎం శ్రీనివాస్, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, మెరైన్ హెడ్ పాడియా, కమర్షియల్ హెడ్ అశోక్‌మిశ్రా, మీడియా మేనేజర్ బొనిగి శీనయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ అలగాయపాళెంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-17 వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ ఈనెల 22 వరకు శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా తుదిజట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన జట్టు 23 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. శిబిరానికి ఇన్‌చార్జిగా కరేడు ఉన్నత పాఠశాల పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు వ్యవహరిస్తారని తెలిపారు. కోచ్‌లుగా వాయల బాబు, వాయల నరేష్ ఉంటారన్నారు. వారి ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చాకిచర్ల ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులు, గ్రామకాపులు పాల్గొన్నారు.

మిసెస్ ఆంధ్రా-2023గా నెల్లూరు మహిళ



ట్రోఫీ అందుకుంటున్న డాక్టర్ వైష్ణవి

నెల్లూరు(బృందావనం): కేరళ రాష్ట్రం కొచ్చిలో యూనిక్ టైమ్స్, డిక్యూ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మిసెస్ సౌతిండియా-2023 పోటీలు జరిగాయి. ఇందులో నెల్లూరుకు చెందిన డాక్టర్ వైష్ణవి రెడ్డి నేదురుమల్లి పాల్గొని మిసెస్ ఆంధ్రా సౌతిండియా 2023 టైటిల్ అందుకున్నారు. గురువారం ఆమె వివరాలు వెల్లడించారు. యూనిక్ టైమ్స్, డిక్యూ ప్రెజెంట్స్ మిసెస్ సౌతిండియా-2023 ఫ్యాషన్ షో తుదిపోరులో టైటిల్ కోసం అనేకమంది పోటీపడ్డారు. కేరళకు చెందిన మెరిన్‌జాన్ టైటిల్ కైవశం చేసుకోగా, డాక్టర్ వైష్ణవి రెడ్డి మిసెస్ ఆంధ్రా-2023 టైటిల్‌తోపాటు మిసెస్ టినసియస్ కిరీటాన్ని పొందారు. టైటిల్‌తోపాటు కిరీటాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ, ప్రిన్సిపల్ కమిషనర్, న్యూఢిల్లీకి చెందిన శ్రీరామ్‌భరత్ అందజేశారు. వైష్ణవి రెడ్డి నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ ఫైనలియర్ చదువుతున్నారు. తనకు ఫ్యాషన్ రంగమంటే చాలా ఇష్టమని ఆమె తెలిపారు.

కూలీలకు ఉపాధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో పక్కాగా అమలవుతోంది. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోంది. పల్లెల్లో కూలీలకు విరివిగా పనులు కల్పించి సకాలంలో నగదు ఇస్తున్నారు.

- సకాలంలో నగదు చెల్లింపులు
- 2022-23 లక్ష్యాన్ని చేరుకోవడంతో అదనంగా పనిదినాలు

జిల్లాలో మండలాలు : **37**

జాబ్‌కార్డులు : **4.10** లక్షలు

2022-23లో పనిదినాల లక్ష్యం : **1.15** కోట్లు

డిసెంబర్ నాటికి కూలీలకు చెల్లించిన నగదు : రూ.**210** కోట్లు



బుచ్చిరెడ్డిపాళెంలో పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట్రావు (ఫైల్)

➡ జిల్లాలో అడిగినవారందరికీ పనులు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో రాపూరు, కలువాయి, సైదాపురం, ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, ఎస్ఆర్‌పురం, జలదంకి, బోగోలు, గుడ్లూరు, ఉలవపాడు తదితర మండలాల్లో ఉపాధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రోజూ 60 వేల మంది కూలీలు హాజరవుతున్నారు. కాగా ప్రస్తుతం వ్యవసాయ పనులు అధికంగా జరుగుతున్నాయి. దీంతో కూలీల సంఖ్య కొంతమేర తగ్గింది. ఈనెలాఖరు నుంచి ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను రెట్టింపు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ సంవత్సరంలో..

2022-23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 85 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీనిని సకాలంలో పూర్తి చేయడంతో అదనంగా 30 లక్షల పనిదినాలను ప్రభుత్వం పెంచింది. మొత్తంగా ఈ ఏడాదిలో 1.15 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. పనులకు హాజరైన కూలీలకు ఇప్పటి వరకు పేమెంట్ల ద్వారా సుమారు రూ.210 కోట్లు చెల్లించారు. 2022 డిసెంబర్ 31వ తేదీ వరకు పేమెంట్లు పూర్తిగా చెల్లించారు. జనవరి నెలకు సంబంధించిన నగదు ఇవ్వాలి ఉంది. మార్చి 31వ తేదీలోపు మిగిలిన పనిదినాలు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. కాగా పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్‌టీలు, ఎఫ్ఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉన్నారు. దీంతో అధికారులు సకాలంలో లక్ష్యాలను చేరుకుంటున్నారు.

ప్రతివారం డిమాండ్ పెట్టి..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో కూలీలు ఉపాధి పనులు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి వారం డిమాండ్ పెట్టి అడిగినవారందరికీ పనులు కల్పిస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఉపాధి పనులు అనేకమందిని ఆదుకున్నాయి. 2020-21 (ఉమ్మడి నెల్లూరు జిల్లా) ఆర్థిక సంవత్సరంలో 1.10 కోట్ల పనిదినాలు కల్పించారు. కూలీలకు వేతనంగా రూ.220 కోట్లకుపైగా నగదు చెల్లించారు. 2020-21లో 1.10 కోట్లు, 2021-22లో 1.29 కోట్ల పనిదినాలను కల్పించారు.

పనులు కల్పిస్తున్నాం



జిల్లాలో ఉపాధి పనులు వేగవంతంగా జరిగిలా చర్యలు చేపట్టాం. జాబ్ కార్డులు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 86 లక్షల పనిదినాలు కల్పించాం. డిసెంబర్ నెల చివరి వరకు కూలీలకు బకాయిలు లేకుండా పేమెంట్లు చెల్లించాం. నగదును బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం జరిగింది.

– వెంకట్రావు, డ్వామా పీడీ



వెంకటాచలంలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కేన్సర్ ఆస్పత్రికి రూ.10 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేసిన లక్ష్మీనరేంద్రబాబు

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రికి ప్రవాస భారతీయుడు విన్నకోట లక్ష్మీనరేంద్రబాబు రూ.10 లక్షలను విరాళంగా అందించారు. తన తల్లిదండ్రులు లక్ష్మీదేవి, వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన గురువారం చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల క్షేమం కోసం తమవంతు పాటుపడుతున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.10 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. దాత మాట్లాడుతూ కేన్సర్ ఆస్పత్రిలో ఒక గది నిర్మాణానికి ఈ నగదు వెచ్చించాలని కోరారు. కార్యక్రమంలో కేన్సర్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ ఎండీ జుబేర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు రంగయ్య నాయుడు, విన్నకోట శివ, నాగరాజు, నిమ్మల వెంకటేశ్వర్లు, జేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	120
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	234
లేయర్ చికెన్	170

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.30
సన్నవి	రూ.17
పండ్లు	రూ.8

సమస్యలు వింటూ.. భరోసా కల్పిస్తూ..



ఏఎస్‌పేట: సమస్యలు తెలుసుకుంటున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ప్రజాప్రతినిధులు ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పిస్తున్నారు. జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరు పంచాయతీలోని శ్రీసాయినగర్, బీసీ కాలనీ, శాంతినగర్, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అనుమసముద్రంపేట మండలంలోని రంగన్నపాడు, అబ్బాసాహెబ్‌పేట, కొత్తపల్లి గ్రామాల్లో, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరు మండలంలోని మత్స్యకార గ్రామమైన పెదపాళెంలో, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బోగోలు మండలం మండలం ఏనుగులబావి పంచాయతీలోని కోళ్లదిన్నె గ్రామంలో, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ నగరంలోని 14వ డివిజన్ ఏసీనగర్ వివేకానంద స్కూల్‌వీధి, మున్సిపల్ క్వార్టర్స్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, సకాలంలో పింఛన్లు ఇస్తున్నారని, పథకాలు పక్కాగా అందుతున్నాయని లబ్ధిదారులు ప్రజాప్రతినిధుల వద్ద ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నా ప్రతిపక్షాలు ఇష్టానుసారం మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యేలు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- సీట్‌బెల్ట్ పెట్టుకోవడంతో డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వరికుంటపాడు: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని జడదేవి గ్రామ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన గుంటి పవన్‌ప్రసాద్ (54), డ్రైవర్ గిరిధర్ భానుమహేష్ కారులో గుంటూరు నుంచి ఉదయగిరికి వెళ్తున్నారు. తెల్లవారుజామున జడదేవి సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పవన్‌ప్రసాద్ కారులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎలాంటి గాయాల్లేకుండా సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కారులోంచి బయటకు తీసేందుకు వీలుకాకపోవడంతో జేసీబీని తెప్పించారు. దాని సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పవన్‌ప్రసాద్ సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడంతో మృతిచెందాడని ఎస్సై తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని రామాపురం వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నుంచి రమేష్ (40) అనే వ్యక్తి మోటార్‌బైక్‌పై నార్తురాజుపాళెం వైపు వస్తున్నాడు. కాగా నార్తురాజుపాళెం నుంచి వ్యవసాయ కూలీలతో ఆటో బుచ్చిరెడ్డిపాళెం కొట్టాలు ప్రాంతానికి వెళ్తోంది. రామాపురం వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమేష్, ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీ నారయ్య (60) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ విజయ్, పైలట్ ఖాజామస్తాన్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నారయ్య (60) పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని 108 సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం లేదు.



చికిత్స పొందుతున్న నారయ్య

తెనాలిలో నెల్లూరు వాసి మృతి



కరిముల్లా మృతదేహం

తెనాలి రూరల్: స్థానిక లాడ్జీలో నెల్లూరుకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వేస్టేషన్ ఎదురు ఉన్న లాడ్జీకి బుధవారం వచ్చాడు. తన పేరు కరిముల్లా అని, ఊరు నెల్లూరు అని చెప్పి మంచం అద్దెకు తీసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం దానిపై మృతిచెంది ఉన్నాడు. అతను బ్లూ కలర్ జీన్సు ప్యాంట్, కాఫీ కలర్ గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. లాడ్జీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాలో? మరే ఇతర కారణమో తెలియదు కానీ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు కరెంటాఫీస్ రైల్వే గేట్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలుపట్టాలపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. వైట్ కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ, బ్లాక్, పర్పుల్, వైట్ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.